www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 మార్చి 2025

5

అన్నమయ్య



రాములోరి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టిటిడి ఛైర్మన్, ఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట: శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీన అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 9న హనుమంత వాహనం, 10న గరుడవాహనం, 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం టిటిడి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 12న రథోత్సవం, 14న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం

- తక్షణమే నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి
- పరిహారం అందే వరకూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం
- రైతులపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ
- మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్



జగన్‌కు సమస్యను వివరిస్తున్న మహిళా రైతులు

ప్రజాశక్తి- లింగాల

ఎన్నికల సమయంలో గొప్పగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విస్మరించి రైతులను మోసగించారని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి పేర్కొన్నారు. పుడమి పుత్రులకు పావల వడ్డీ రుణాలు , రైతు భరోసా కింద ఇవ్వాల్సిన సొమ్ము , ఇన్‌పుట్ సబ్సిడీ అమలు చేయకుండా దగా చేశారు అని, ఇ రకమైన ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తాం అని ఆయన అన్నారు. ఆయన సోమవారం మండల పరిధిలోని తాతిరెడ్డి పల్లె, కోమన్నూతల ప్రకృతి వైపరీత్యానికి నేలకొరిగిన అరటి పంటను పరిశీలించారు. నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. అప్పులు చేసి మరి పంటలు సాగు చేశామని, పంట చేతికందే సమయంలో దెబ్బతిన్నడంతో తీవ్రంగా నష్టం పోయామని మహిళ రైతులు వాపోయారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లి చెందిన రైతు ఇద్దరు ఆత్మహత్యయత్నం పాల్పడిన ఇద్దరి రైతుల కుటుంబ సభ్యులు జగన్ ముందు బోరున విలపించారు. నష్టపోయిన రైతులను పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని చెర్లపల్లె, ఎగువపల్లె, పార్నపల్లె, గ్రామాల్లో 4వేల ఏకరాలలో పంట దెబ్బతిన్నాయని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పంట నష్టంపై ఉద్యానశాఖ అధికారులతో జగన్ చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పండిన అరటి పంటకు విదేశాలలో మంచి డిమాండ్ ఉందని గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో రైతుల కోసం పులివెందుల ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజీ రూ. 25 కోట్లతో నిర్మించి ప్రారంభించామన్నారు. దాని యుజర్ ఏజెన్సీకి వాడుకోవడం లేదన్నారు. రైతులపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందన్నారు యుజర్ ఏజెన్సీ ద్వారా 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉందన్నారు. గత ప్రభుత్వంలో రైతులు నేరుగా అరటి పంటను కోల్డ్ స్టోరేజ్ నుంచి రెండు కంటైనర్లలో ఎగుమతి చేశామని చెప్పారు. నెల రోజుల కింద టన్ను రూ.26 వేలు ఉన్న అరటి ధర, ప్రస్తుతం రూ.9 వేలకు పడిపోయిందని వాపోయారు. మిర్చి, కంది, పెసర, శనగ, మినుములు ఏ పంటకూ గిట్టుబాటు ధరల లేదన్నారు. చీని రైతులకు గతంలో టన్ను రూ. లక్ష ఉండేదని, ఇప్పుడు సూట్ రూపంలో వారిని మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్లమెంటు సభ్యులు వై.ఎస్. అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, యుత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి ,వైసిపి నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షులు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు



సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఎడిఫై స్కూల్, ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు, స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను తుంగలో తొక్కి వ్యాపారమే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రయివేటు స్కూల్ టీచర్స్‌ను ముందస్తు అడ్మిషన్ల పేరుతో ఇంటింటికి తిప్పుతున్నారన్నారు. ఎడిఫై విద్యా సంస్థలు 2025-26 అడ్మిషన్ల కోసం నిమ్మనపల్లె మండలంలో పాఠశాల నిర్మాణం చేపట్టినా ప్రస్తుతం పునాదుల వరకే పని జరిగిందన్నారు. మదనపల్లెలో అద్దెకు తీసుకున్న రూమ్‌లో అడ్మిషన్లు చేస్తూ నాలుగో తరగతి విద్యార్థికి రూ.55 వేలు ఫీజుతో పాటు వ్యాన్ ఫీజు, యూనిఫామ్, బుక్స్ ఇతరత్రా స్టేషనరి పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంఇఒ పద్మావతి ఎడిఫై స్కూల్‌కు ఇప్పటి వరకూ ఎలాంటి అనుమతులు లేవని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారన్నారు. ఎడిఫై విద్యాసంస్థలో అడ్మిషన్లు ఆపలేదని, ప్రచార బ్యానర్లు, ప్రచార సామగ్రిని కూడా ఎక్కడ తొలగించలేదన్నారు. ఎడిఫై విద్యా సంస్థలకు పక్కా భవనం లేకపోయినప్పటికీ, విద్యాశాఖ అధికారులు ముడుపులు తీసుకోవడంతోనే వారి ప్రచార ఆర్భాటం శృతి మించిందని స్పష్టంగా కనపడుతోందన్నారు. చిత్రీకరించిన పాఠశాల భవనం ఫొటోలను అనుమతుల కోసం అధికారులకు అందజేసి తప్పు సమాచారం ఇచ్చిన ఎడిఫై విద్యాసంస్థలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అకడమిక్ సంవత్సరం పూర్తికాక ముందే ప్రయివేట్ జూనియర్ కళాశాలలో విచ్చలవిడిగా ముందస్తు అడ్మిషన్లు చేయడం, తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన బాట చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను కలిసి ఎడిఫై విద్యాసంస్థల మోసాన్ని వివరించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రిది, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, ప్రేమ్, సుదర్శన్, హేమంత్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తుందన్నారు. . ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని పేర్కొన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి : 'అరవ'



సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-చిట్వేల్

వేసవికాలం కావడంతో అధికారులు తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. సోమవారం ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిపి టంగుటూరి చంద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీటి సమస్య ఎక్కడ లేకుండా చూడాలనిమ తెలిపారు. ఒకవేళ అలాంటి సమస్యలు ఎదురైతే తక్షణం ఒకటి రెండు రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. పండ్ల తోటలకు ముఖ్యంగా మామిడి రైతులు పూత సరిగా నిలవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనికి వాడే పురుగుమందులపై ప్రత్యామ్నాయంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు రూ.4.65 లక్షలతో సిసి రోడ్లు మొదలుపెట్టామని చెప్పారు. ఎపిఎండిసి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో 21 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. విద్యుత్ శాఖ వారు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్ వచ్చిన వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారుల నుండి వచ్చిన దరఖాస్తులకు వెంటనే సంబంధిత అధికారి అనుభవ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సభ ఆలస్యంగా 12 గంటలకు మొదలైనా రెండు గంటల సమయంలోనే ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సుబ్రహ్మణ్యంరెడ్డి రామానుజుల నాయుడు, తహశీల్దార్ మోహన్‌కృష్ణ, ఎంపిడిఒ మోహన్, ఎస్ఐ రఘురాం, నరసింహ, చంద్రమోహన్ రవికుమార్ రాజు, గుండయ్య, నాగార్జున, పెంచల్ రెడ్డి, ఏదోటి రాజశేఖర్, కృష్ణయ్య యాదవ్, గూడూరు నాగరాజు, కో-ఆప్షన్ సభ్యుడు ఆన్సర్ బాష, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఆటోకు పోలీస్ నెంబర్ తప్పనిసరి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి ఆటోకూ పోలీస్ నెంబర్ ఉండాలని, ప్రమాదాలు ఏమైనా జరిగినా సమాచార ఇవ్వడానికి ఉపయోగపడుతుందని ఎస్ఐ పి.రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటోలకు పోలీస్ నెంబర్ల స్టిక్కర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన ప్రతి ఆటోకూ పోలీస్ నెంబర్ కోడ్ అమలు చేసుకోవడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కాంతారావు, ఆటో డ్రైవర్లు జాన్ బాబు, మస్తాన్, రాజశేఖర్, సద్దాం హుస్సేన్ పలువురు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు అందజేస్తున్న ఎస్ఐ రామకృష్ణ



సచివాలయం ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. సోమవారం కురవంక, 28వ వార్డు సచివాలయాలని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఎమ్మెల్యే సచివాలయం తనిఖీ నిర్వహించిన సమయంలో ఇద్దరు సిబ్బంది మాత్రమే ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు నమోదు రిజిస్టర్లో సంతకాలు పెట్టి సచివాలయంలో అందుబాటులో లేని సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ తాజ్ మస్రూరుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది సచివాలయంలో అందుబాటులో లేకపోవడం బాధ్యతా రాహిత్యమేనన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బెల్లెరెడ్డిప్రసాద్, శ్రీరాములు, వినోద్, దొరస్వామి నాయుడు, తదితరలు ఉన్నారు.

'మిట్స్' విద్యార్థులకు ఎఐపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్ళు సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం వారు కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) సహకారంతో ఎడ్జ్ ఎఐ 2.0 రియల్-టైమ్ ఇంటెలిజెంట్ ఎంటర్‌ప్రైజెస్‌ను స్థాపించడం, అభివృద్ధి చేయడం అనే అంశంపై ఒక ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్జ్ ఎఐ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యత, రియల్-టైమ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో దీని అనువర్తనాలపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ముఖ్య అతిథిగా బెంగళూరులోని రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్, ఎఐ ప్లాట్‌ఫామ్స్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పెతురు రాజ్ పాల్గొన్నారు. కార్యకమంలో పెతురు రాజ్ మాట్లాడుతూ ఎడ్జ్ ఎ ఐ పరిణామం, పారిశ్రామిక రంగంపై దీని ప్రభావం, తదుపరి తరం ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అభివృద్ధిలో దీని పాత్ర గురించి వివరించారు. తక్కువ జాప్యంతో, అధిక సామర్థ్యంతో ఎడ్జ్ ఎఐ ద్వారా ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలు ఎంత వేగంగా మారుతున్నాయి అనే విషయాన్ని వివరించారు. విద్యార్థులు పారిశ్రామక వ్యక్తులుగా అభివృద్ధి చెందాలని, అందుకు ఎలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామానాథన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెతురు రాజ్



సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు

కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్‌సి ఎబిసిడి వర్గీకరణ రాజ్యాంగ బద్ధం కాదని అది ఏనాటికైనా తుడిచిపెట్టుకుపోవాల్సిందేనని మాల మహానాడు నాయకులు తెలిపారు. రాజీవ్ రంజన్ కమిషన్ ఏకపక్ష నివేదికను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర జనరల్ సెక్రటరీ యమల సుదర్శన్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మా వెంట ఉందని, రాజ్యాంగం ద్వారా మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజీవ్ రంజన్ కమిషన్ ఏకపక్ష నివేదిక చెల్లదన్నారు ఎస్‌సి ఎబిసిడి వర్గీకరణ రాజ్యాంగబద్ధం కాదన్నారు. రాబోయే కాలంలో ఇది మరల తుడుచు పెట్టుకు పోవడం ఖాయమన్నారు. కూటమి పాలన త్వరలోనే అంతం అవుతుందన్నారు. నేటి కులగనణ ప్రకారం విభజనపై చర్చించాలన్నారు. క్యాబినెట్లో చేసిన తీర్మానాన్ని రద్దు పరచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాలలంతా ఐక్యమై ఉద్యమ పోరాటాలకు సిద్ధమౌతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహానాడు నాయకులు గుండా మనోహర్, మల్లెల మోహన్, కొప్పల రామచంద్ర, ప్రశాంత్, వెంకటరమణ, శ్రీరాములు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాస్ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి స్థానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుంటూరు నగరంలో ఆదివారం భారతీయ అంబేద్కర్ సేన (బాస్) స్టేట్ కమిటీ ఎన్నిక-ప్రమాణ స్వీకారం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు దుర్గం సుబ్బారావు, కె.వి.రమణ పర్యవేక్షణలో ఎన్నుకున్న రాష్ట్ర కమిటీలో మదనపల్లె డివిజన్‌కు చెందిన ముగ్గురికి చోటు దక్కింది. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యంకు చెందిన ముత్యాల మోహన్, మదనపల్లె నియోజకవర్గానికి చెందిన నీరుగట్టి రమణ, టి.ఎ.పీర్ బాషా ఉన్నారు. కొత్త కమిటీలో ముత్యాల మోహన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, నీరుగట్టి రమణ రాష్ట్ర కోశాధికారిగా, టి.ఎ.పీర్ బాషా రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు ముగ్గురూ 15 ఏళ్లుగా సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. మదనపల్లె డివిజన్‌నుండి ముగ్గురికి రాష్ట్ర కమిటీలో పదవులు దక్కడంపై స్థానిక బాస్ శ్రేణులు హర్షం ప్రకటించారు. హర్షం ప్రకటించి, శుభాకాంక్షలు తెలిపిన వారిలో చాట్ల బయన్న, సొన్నికంటి రెడ్డెప్ప, తలారి కృష్ణ, బురుజు రెడ్డిప్రసాద్, మహేంద్ర, బండకోట రవి, బి.నరసింహులు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీకి ఎన్నికైన మోహన్, రమణ, పీర్ బాషాలు మాట్లాడుతూ తమకు ఇంత గొప్ప అవకాశం కల్పించిన బాస్ అధినేత పిటిఎం శివప్రసాద్‌కు, బాస్ రాష్ట్ర స్థాయి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో బాస్ సంస్థను బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని చెప్పారు. అంతకు ముందు నూతన కమిటీ ప్రతినిధులు భారత రాజ్యాంగ పీఠిక ముందు నిలబడి ప్రమాణస్వీకారం చేశారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్యామలదేవి

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫామ్ పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్యామల దేవిను స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలను పెంపొందించడం కోసం స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్‌ను పాఠశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. పిఎంశ్రీ నిధులు రూ.30 వేలతో స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాం కొనుగోలు చేసి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు ప్రేమ్ సాగర్, పెద్దయ్య. గైడ్ కెప్టెన్లు శివలీల, చంద్రసేన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మోసం చేసి పొలం లాక్కున్నారు

- న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతుల వేడుకోలు



వృద్ధ దంపతుల గోడు వింటున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జీవనాధారంగా ఉన్న పొలాలను తమ మనవళ్లు అదిరించి, బెదిరించి, బలవంతంగా, మోసపూరితంగా రాయించుకుని బయటకు గెంటేశారని, ఇప్పుడు పూట గడవడం రోజుకో గండంగా మారిందని వృద్ధ దంపతులు కన్నీటి పర్యంతమవుతూ సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు. బాధితులు సబ్ కలెక్టర్‌కు తెలిపిన వివరాల మేరకు.. కెవి.పల్లి మండలం, గ్యారంపల్లి పంచాయతీ, సంకేనగుట్టపల్లికి చెందిన ఎల్లమ్మ రాజారెడ్డి అనే వృద్ధ దంపతులకు అదే గ్రామంలో 15 ఎకరాల సాగు భూమి ఉంది. రెండెకరాల మడి మాగాని, 30 చింత చెట్లు ఉన్నాయి. వీరి కుమారుడు వెంకటరమణారెడ్డి, శాంతమ్మ దంపతులకు దామోదర్, గిరిధర్, లోకేష్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వెంకటరమణారెడ్డి తన ముగ్గురు కుమారులకు తండ్రి రాజారెడ్డి నుంచి సంక్రమించిన భూమి నుంచి 9 ఎకరాలు భాగపరిష్కారం చేసి పంచి పెట్టారు. తక్కిన భూమి, మడి మాగాణి, చింత చెట్లు రాజారెడ్డి ఆధీనంలో ఉన్నాయి. కుమారుడు, మనవళ్లు ఎవరూ పట్టించుకోక పోవడంతో రాజారెడ్డి, ఎల్లమ్మ దంపతులు వేరుగా ఉంటూ ఉన్న భూమిని గుత్తకు ఇచ్చుకుని దానిద్వారా వచ్చే గుత్త, చింతచెట్ల ఫలసాయంతో వృద్ధాప్యాన్ని నెట్టకొస్తున్నారు. ఈ క్రమంలో పెద్ద మనవడు దామోదర్ వీరి వద్దకు వచ్చి మడిమాగాని తన పేరు రాయాలని అడిగాడు. కుదరదని చెప్పడంతో రాయకపోతే చంపేస్తానని వేట కొడవలితో బెదిరించాడు. బిత్తరపోయిన ఆ వృద్ధ దంపతులు తమకు వేరే దారి లేక మడి మాగానని రాయించమన్నారు. మరో ఇద్దరు మనవళు గిరిధర్, లోకేష్ కలిసి తమను మోసపూరితంగా హాస్పిటల్ తీసుకెళ్లి కంటి పరీక్షలు చేయిస్తామని నమ్మబలికారన్నారు. కంటిపరీక్షల కోసం సంతకాలు పెట్టాలని చెప్పి, భూమి వారి పేర రాయిస్తున్నట్లు డాక్యుమెంట్ పత్రాలలో మోసపూరితంగా సంతకాలు చేయించుకొని, భూమి ఆక్రమించుకున్నారన్నారు. తాము దిక్కులేని వారమైపోయామని, బంధువుల ఇంట్లో తల దాచుకుంటూ పూటకో గండంగా బ్రతుకుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. కళ్ళు సరిగ్గా కనపడవని, మాట సరిగ్గా వినపడదని, నడవలేని నిస్సాహాయ స్థితిలో ఉన్నామని, చూసే దిక్కు ఎవరు లేరని న్యాయం చేసి ఆదుకోవాలని సబ్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఈ వృద్ధ దంపతులు సబ్ కలెక్టర్ వద్దకు వెళ్లేందుకు కూడా శక్తి లేకపోవడంతో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ బయటకు వచ్చి వారు గోడును ఓపిగ్గా విన్నారు. ఖచ్చితంగా న్యాయం చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చి వారికి ధైర్యం చెప్పారు.



మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్ వైజర్ భాను లక్ష్మీదేవి

అంగన్వాడీలు సామర్థ్యాభివృద్ధిని పెంచుకోవాలి

ప్రజాశక్తి - నిమ్మనపల్లి

అంగన్వాడీ కార్యకర్తలు సామర్థ్యాభివృద్ధిని పెంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ భాను లక్ష్మీదేవి తెలిపారు. అంగన్వాడీల్లో విద్యా నాణ్యతను, మెరుగైన ఆరోగ్య మెరుగుపరచడే లక్ష్యంతో రెడ్డివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ పఢాయీ భీ మూడవ విడత శిక్షణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను సుశిక్షితులైన కార్యకర్తలతో అభ్యాస కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పిల్లల్లో భౌతిక, మేధో, భాషా, సామాజిక భావోద్వేగ, సాంస్కృతిక సౌందర్యాభివృద్ధి, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామన్నారు. 0-3 సంవత్సరాల వయస్సు పిల్లలకు ప్రారంభ ఉద్దీపన, దివ్యాంగ పిల్లలతో సహా 3-6 సంవత్సరాల వయస్సు పిల్లలకు బాల్య సంరక్షణ, విద్యను ప్రోత్సహించడం, ఊనిక పాఠ్యాంశాలు, బోధనా విధానాలపై ప్రాథమిక అవగాహనతో అంగన్వాడీ కార్యకర్తల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, పోషన్ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతులు, సూక్ష్మపోషక లోపాలు మొదలైన వాటితో సహా పోషకాహారంపై అంగన్వాడీ కార్యకర్తల అవగాహనను పెంచడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌పిని సన్మానిస్తున్న రాయలసీమ కళాపీఠం ప్రతినిధులు

ఉగాది పురస్కారాలకు ఎస్‌పికి ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాయలసీమ కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన జరుగు ఉగాది వేడుకలకు ఉగాది పురస్కారాలు అందించేందుకు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడును రాయలసీమ కళాపీఠం అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, కార్యదర్శి గీతాంజలి రమణ, కార్యవర్గ సభ్యులు సుధాకర్, సుబ్బరాయలు, హరిగోపాల్ సోమవారం రాయచోటిలోని ఎస్‌పి కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు ఆహ్వానం పలికారు. రాయలసీమ కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30న కవులు, కళాకారులు, సమాజ సేవకులకు పురస్కారాలు అందజేయనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

కూలి డబ్బుల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి- రామాపురం

ఉపాధి పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా కూలి డబ్బులు తమ ఖాతాలో పడలేదని కూలీలు వాపోతున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మూడు నెలల నుండి చేసిన పనులకు డబ్బులు తమ ఖాతాలో పడడం లేదని పేర్కొన్నారు. డబ్బులు పడక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జిల్లా అధికారులు చొరవ తీసుకొని తమ ఖాతాలలో డబ్బులు పడే విధంగా చర్య తీసుకోవాలని కోరారు.

పరీక్ష తేదీ మార్పు

ప్రజాశక్తి రాయచోటి

2025 - 2026 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో (ఎపిఎస్ డబ్ల్యుఆర్ఇఐఎస్) 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఏప్రిల్ 4న నిర్వహించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల ఏప్రిల్ 13కు వాయిదా వేశామని ఉమ్మడి జిల్లా కో- ఆర్డినేటర్ ఎ. ఉదయ ఒక ప్రకటన పేర్కొన్నారు. దరఖాస్తుదారులు మార్పును గమనించి 13న పరీక్షకు హాజరు కావాలని తెలియజేశారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 1న ఇస్తారని తెలిపారు. 13న ఉదయం 9 గంటలకు 5వ తరగతిలో చేరేవారికి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే వారికి నిర్వహిస్తారన్నారు.

ఏప్రిల్ 7 నుంచి ఉచిత వృత్తి శిక్షణ

ప్రజాశక్తి - గాలివీడు

సేవ్ ఆల్ రిచ్ ఆల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్, టైలరింగ్‌లలో ఈనెల 7 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ చైర్మన్ జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, పేద విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. శిక్షణ కాలం 90 రోజులు అని పేర్కొన్నారు. విద్యార్థులు అర్హతలు 10 ఆ పైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7569171405, 8374852461లలో సంప్రదించాలన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణం, మండలంలోని మసీదులలో విధులు నిర్వహిస్తున్న హజరత్, మౌజంలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో రంజాన్ కానుకను మాజీ ఎంపిపి ఖలీల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైందన్నారు. 31 రోజులపాటు ముస్లిం సోదరులు కఠోర ఉపవాస దీక్షలు ఉంటారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గం ప్రజలు సోదర భావంతో మెలిగి మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని ప్రశంసించారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో బి.కొత్తకోట మండలం వైసిపి కన్వీనర్ ప్రదీప్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మాలిక్, బి.కొత్తకోట పట్టణం వైసిపి కన్వీనర్ సి.ఆర్.చిన్నికృష్ణ, వైస్ ఎంపిపి ఖాదర్ వలీ, మాజీ వైసిపి పట్టణ కన్వీనర్ జాఫర్, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాం రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ బాషా, నాయకులు సద్దాం,రఫీ,నక్క సంతోష్, సాయి, గట్టు తన్వీర్ పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ అంతం : జెసి



రాయచోటి : ర్యాలీలో పాల్గొన్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

టిబి (క్షయ) వ్యాధిని అంతం చేయవచ్చని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి బంగ్లా సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 61 పంచాయతీలను టిబి ముక్త్ అభియాన్‌లో భాగంగా ఎంపిక చేశామన్నారు. జిల్లాలో అన్ని పిహెచ్‌సి, యుపిహెచ్‌లు, సామాజిక ప్రాంతీయ జిల్లా ఆసుపత్రిలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం పరీక్షలు, ఎక్సరే పూర్తిగా ఉచితంగా చేస్తారని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచిత మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని నివారించవచ్చని అన్నారు. జిల్లాలో మొత్తం తొమ్మిది టిబి యూనిట్లు ఉన్నాయని ప్రతి యూనిట్‌లో సిబ్బంది టిబి కేసులను గుర్తించడం, వాటి నిర్ధారణ పరీక్షలు చేయడం, చికిత్స ద్వారా మందులు ఇవ్వడం, పర్యవేక్షణ చేయడం, రోగులకు ప్రధానమంత్రి పోషన్ అభియాన్ పథకం కింద నెలకు రూ.వెయ్యి చొప్పున వారి ఖాతాలో జమ చేయడం, రోగులకు దాతల ద్వారా దత్తత తీసుకొని ఫాలో చేయడం వంటివి చేస్తారని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో టిబి వ్యాధిపై అవగాహన సదస్సులు విడివిడిగా నిర్వహిస్తారన్నారు. వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కొండయ్య, టిబి కార్యక్రమ అధికారి డాక్టర్ శైలజ, ఆరోగ్య వైద్యాధికారి మొహమ్మద్ రఫీ, డిసిహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, డాక్టర్ కోటేశ్వరి, డిపిఎంఒ రియాజ్ బేక్, డాక్టర్ రెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా టిబి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెన్నారెడ్డి, లింక్ వర్కర్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ అల్లావలి, టిబి పర్యవేక్షకులు శ్రీనివాసులు, మురళి, ప్రతాప్, ప్రణీత్, తరుణ్, సుశీల పాల్గొన్నారు. **పీలేరు:** క్షయ రహిత సమాజ నిర్మాణం కోసం సమిష్టిగా కృషి చేద్దామని, అందుకు టిబి వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పీలేరులో నిర్వహించిన ర్యాలీ, అవగాహన సదస్సులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తుల పట్ల వివక్షను వీడి సమిష్టి కృషితో అంతం చేద్దామని పిలుపునిచ్చారు. తర్వాత టిబి వ్యాధిగ్రస్తులకు మెరుగైన సూచనలు, సలహాలతో డాట్ సేవలందించిన 25 మంది వివిధ స్థాయిలోని ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తలుపుల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, ఆర్ఎంఒ డాక్టర్ సరస్వతమ్మ, డాక్టర్ నాగవేణి, డాక్టర్ కేశవులు, డాక్టర్ కరీముల్లా, డాక్టర్ చంద్ర శేఖర్ నాయక్, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున, షరీఫ్ జాన్, పవన్, మిహాన్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య పాల్గొన్నారు. **పుల్లంపేట:** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ చంద్ర తెలిపారు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న కుమార్, సిహెచ్‌ఒ కోటేశ్వ రయ్య, ఎఎన్ఎం కళావతి, ఆశావర్కర్ సునీతలకు అధికారులు చేతులమీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్ర మంలో హరో హరమ్మ, సూపర్‌వైజర్ కుమారి, ఫార్మసిస్ట్ కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారెడ్డి, శరత్ చంద్ర రాజు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బంది ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **కంభంవారిపల్లి :** గ్యారంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్‌ను డాక్టర్ చంద్రశేఖర్ పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా కృషి చేసినందుకు అవార్డు అందజేశామని తెలియజేశారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ పావని ఫార్మసీ ఆఫీసర్ గంగాధర్‌ను అభినందించి, ఇలాంటి అవార్డులు మరెన్నో తీసుకోవాలని ఆకాక్షించారు. **రైల్వేకోడూరు :** క్షయ వ్యాధి నివారణే ప్రభుత్వ లక్ష్యమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ కె.బ్రహ్మకుమారి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి వారికి ప్రశంస పత్రాలు, ఎగ్జామ్స్ ప్యాడ్స్ పెన్స్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మకుమారి, వైద్యులు గురుమహేష్, ఎస్ మస్తానీ, సాయి, పారామెడికల్ సిబ్బంది పి. ఓబులేసు, బాలకృష్ణమ రాజు,శివశంకర్ గౌడ్, ఆసియా, మల్లికార్జున, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఫార్మసిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ ఆశాలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** క్షయ వ్యాధి నివారణే ధ్యేయంగా అడుగులు ముందుకు వేయాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నివారణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎఎస్‌పి మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే సూచించారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శేఖర్, టీబీ వైద్యాధికారి శరత్ ఆధ్వర్యంలో టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్ పర్యవేక్షణలో ఏరియా ఆసుపత్రి నుంచి మార్కెట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు సౌజన్యంతో పదిమంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. క్షయ నివారణలో ఉత్తమ సేవలు అందించిన డాక్టర్ అశోక్ చైతన్యకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర రాజు, ఆర్ఎంఒ డాక్టర్ అనిల్, వైద్యులు లక్ష్మీ ప్రసన్న, సౌజన్య, సుధాకర్, సునీల్, జీవ, సుబ్బారెడ్డి, శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, కరుణాకర్, శశాంక్, చలమయ్య, ఆకేపాడు పిహెచ్‌సి సూపర్‌వైజర్ రవిశంకర్ రాజు, ఎంపిహెచ్ ఇఒ శంకర్ రాజు, యుడిసి సిద్ధిరామయ్య, సబ్ యూనిట్ అధికారి స్వామి దాస్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాకార్యకర్తలు, ప్రియాంక నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** చేయి.. చేయి.. కలుపుదాం క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా ప్రభుత్వాస్పత్రి ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అర్చనబాబు తెలిపారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా టిబి యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చన బాబు, అర్ఎంఒ డాక్టర్ మసుధ్ సుకూర్, మదనపల్లె టిబి విభాగం సిబ్బంది దయాలన్, ప్రభాకర్, శాంతి, వనజ కుమారి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ గ్రేడ్1 సూపరింటెండెంట్ మంజు, నాగశ్రీ, వరలక్ష్మి, కృష్ణ కుమారి, ఆసుపత్రి సిబ్బంది, ఎఆర్‌టి, ఐసిటిసి పాల్గొన్నారు.



పీలేరు :ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వైద్యులు



మదనపల్లె : ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది

అంబేద్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం పీలేరు మాలమహానాడు మండల ఈ యువాధ్యక్షులు జెట్టి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ సంఘటనపై సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలని వారన్నారు. విగ్రహాల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉండేలా చట్టాల సవరణ చేయాలని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు ఎంతటి వారినైనా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీతోపాటు రాజ ద్రోహం కేసులు నమోదు చేసి జీవితంలో జైలు నుండి బయటకు రాకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ అంబేద్కర్ సేవా సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండ్లూరు రాజేశ్వరి, మాలమహానాడు మహిళా అధ్యక్షురాలు నంద్యాల నాగేశ్వరమ్మ, బిస్మిల్లా ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షులు రహమత్ పీర్, పట్టణ ఉపాధ్యక్షులు వి. చంద్రశేఖర్, ఆటో కార్మికులు మస్తాన్, ఖాదర్ వలి, బాబు నాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చింతకాయల రామమూర్తి, బిసి నాయకులు చక్కెర వెంకటరమణ, మాలమహానాడు కార్యవర్గ సభ్యులు అర్పింట్ రెడేప్ప, అంబటి వెంకటరమణ పాల్గొన్నారు.

వారంలోగా రైతులకు నష్టపరిహారం

- ప్రతి రైతునూ ఆదుకుంటాం
- ఎకరాకు రూ.35 వేల చొప్పున చెల్లిస్తాం
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వడగండ్ల వాన,బలమైన గాలికి నియోజక వర్గంలోని లింగాల మండలంలో భారీ పంట నష్టం వాటిల్లిందని, వారంలోగా బాధిత రైతులకు పరిహారం అందిస్తామని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం లింగాల మండలంలో దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించిన అనంతరం పట్టణంలోని తన నివాసం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎపుడు లేని విధంగా వేల ఎకరాల్లో వడగండ్ల వాన, బలమైన గాలికి మూడు వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పంట నష్టం జరిగిన 12 గంటల్లోనే నష్ట పరిహారం నివేదికలు తయారు చేస్తూ ప్రభుత్వం స్పందిస్తూ ఉంటే జగన్ మాత్రం నాలుగు సంవత్సరాల్లో మన ప్రభుత్వం వస్తుంది అపుడు రైతులను ఆదుకుంటామని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పరామర్శ యాత్ర కాస్తా జైత్ర యాత్రగా సాగిందన్నారు. 2024కు ముందు అరటి పంటకు నష్ట పరిహారం హెక్టర్ కు రూ. 25 వేలు ఉంటే కూటమి అధికారంలోకి రాగానే రూ. 35 వేలకు పెంచామని చెప్పారు. రూ.25 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తే దానిని ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురా లేదు అని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతులతో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ పాలనలోనే కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ పనులు పూర్తి చేయలేదన్నారు. కోల్డ్ స్టోరేజ్ వద్ద నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా కోసం జనరేటర్ కూడా ఏర్పాటు చేయలేదు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించందని చెప్పారు. స్టోరేజ్ యూజర్ ఏజెన్సీలకు ఈ నెల 28న కలెక్టర్ ఆధ్వర్యంలో బిడ్డింగ్ ఉందని చెప్పారు. ప్రస్తుతం నష్ట పోయిన ప్రతి రైతుకు పిలకలు ఉచితంగా ఇచ్చి వారిని ఆదుకోవాలని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్తే న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అరటి మాత్రమే కాకుండా ఆకుల తోటలు,బొప్పాయి, దానిమ్మ ,మొక్క జొన్న పంటలు కూడా దెబ్బ తిన్నట్లు సమాచారం ఉందని, దెబ్బ తిన్న ప్రతి ఒక్క పంట రైతులకు ఎకరాకు రూ. 35 వేలు నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణారెడ్డి, బొజ్జా మైసురా రెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వేలంలో రూ.3.95 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలో బస్టాండ్ గేట్ వేలంపాట ద్వారా రూ.3.95 పంచాయతీ ఆదాయం వచ్చినట్లు డిఎల్‌పిఒ నాగరాజు తెలిపారు. సోమవారం ఎంపిడిఒ సమావేశపు హాల్లో బస్టాండ్ గేట్ వేలం పాట నిర్వహించారు. మహేష్ రూ.3.95 లక్షలకు పాటలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలు ఫర్, వైస్ ఎంపిపి కరీం, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు వారపు సంత, చేపల చెరువుకు వేలం

ప్రజాశక్తి - తంబళ్లపల్లి

మండలంలోని కోసువారిపల్లె వారపు సంత, బయమ్మచెరువు చేపల చెరువుకు వేలంపాట ఈ నెల 26వ తేదీ బుధవారం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. పాటదారులు వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.



బ్రిడ్జి నిర్మించి పొలాలకు దారి కల్పించాలంటున్న గ్రామస్తులు

హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి నిర్మించండి

- సబ్ కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి నిర్మించి మా పొలాలకు దారి కల్పించాలని మండలంలోని అంకిశెట్టిపల్లె, నల్లగుట్లపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఆ ప్రాంత రైతులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ అంకిశెట్టిపల్లి నల్లగుట్లపల్లి గ్రామానికి ఆనుకుని హంద్రీ-నీవా కాలువ ఏర్పాటు చేశారన్నారు. కాలువకు ఇరువైపుల తమ పొలాలు ఉన్నందున, పొలాలకు వెళ్లి వ్యవసాయం చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కాలువ దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యంగా వర్షాకాల సమయంలో కాలువపై జారిపడి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోయారు. తాము అందరం వ్యవసాయ కూలీలమని, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులమన్నారు. వ్యవసాయమే తమకు జీవనాధారమని, తమకు చాలా ఇబ్బందికరంగా ఉన్న హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేసి దారి కల్పించాలని కోరారు. ఈ విషయమై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో అంకిశెట్టిపల్లె గ్రామానికి చెందిన రైతులు కృష్ణమూర్తి, ఆరిఫుల్లాఖాన్, రామ్మూర్తి నాయక్, నారాయణరెడ్డి, వెంకటరమణ, కృష్ణమ్మ, కృష్ణమూర్తి, గంగూ నాయక్ ఉన్నారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాయచోటి : వేసవి ఉష్ణోగ్రతలో దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి అధికారి డి. వి. రంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలను అనుగుణంగా రాష్ట్ర కార్మిక కమిషనర్ శేషగిరి బాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. కర్మాగారాలు, దుకాణాలు, సంస్థలో పనిచేసేవారు భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఇదివరకే పలు సూచనలు చేసినట్లు తెలిపారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేయాలన్నారు. పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలన్నారు. వైద్య సిబ్బందితో సమయం చేసుకొని ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్, అత్యవసరం మందులను సమకూర్చుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పని వేళలు మార్పు చేయాలని డీహైడ్రేషన్ నివారణ మార్గాలను అవగాహన కల్పించాలని తెలిపారు.

రేపు ఫ్యాప్టో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాయచోటి : జిల్లా ఫ్యాప్టో నూతన కమిటీ ఎన్నిక బుధవారం సాయంత్రం 4.30 గంటలకు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ అంకంశివారెడ్డి, ఫ్యాప్టో జనరల్ సెక్రెటరీ అర్.రవి శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా రూటా రాష్ట్ర నాయకులు ఇక్బాల్ హాజరవుతారు అని తెలిపారు అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

క్రైం కార్నర్



వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను కత్తిరించుకెళ్ళిన దుండగులు

వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో మరో మారు కేబుల్ వైర్ల చోరీదారులు చెలరేగిపోయారు. ఆదివారం అర్ధరాత్రి ఒక్కరోజే 15 వ్యవసాయ బోర్ల వద్ద దుండగులు కేబుల్ వైర్లను కత్తిరించకపోయారని బాధిత రైతులు స్థానిక సర్పంచ్ పాపులమ్మ మల్లప్పతో కలసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతుల వివరాల మేరకు.. వెంగంవారిపల్లె పంచాయతీ పరిధిలోని వెంగళవారిపల్లె, వెంగళవారి కురవపల్లె, సింగంవారిపల్లెకు చెందిన రైతుల వ్యవసాయ పొలాల వద్ద ఆదివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల మధ్య 25 వ్యవసాయ బోర్ల వద్ద గుర్తుతెలియని దుండగులు కేబుల్ వైర్లను కత్తిరించకెళ్లారు. సుమారు రూ.3 లక్షల విలువ గల రెండు వేల మీటర్ల పొడవు గల కేబుల్ వైర్లను ఒక్క రోజులోనే పెద్ద మొత్తంలో దుండగులు దోచుకెళ్లారు. సోమవారం ఉదయం వెంగళవారి కురవపల్లికు చెందిన బాధిత రైతులు సుధాకర, హరికృష్ణ, అమర్నాథ్, సుదర్శన్‌రెడ్డి కలసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ బోర్ల వద్ద వరి, టమోటా వంటి ప్రధాన పంటలను ప్రస్తుతం వేసి ఉన్నామని, వేసవికాలంలో కేబుల్ వైర్ల చోరీలు జరుగుతుండడంతో సకాలంలో పంటలకు నీరు అందించలేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్న దుండగులను గుర్తించి రైతులకు తగు న్యాయం చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రామక్కపల్లె గ్రామానికి చెందిన సామాబత్తిన సుబ్బమ్మ (80) కర్ణాటక రాష్ట్రం బళ్లారి రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే పట్టాల దగ్గర అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాలలోకి వెళ్తే...రామక్కపల్లి గ్రామానికి చెందిన సామాబత్తెన సుబ్బమ్మ గోవాలో విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తూ ఉద్యోగ విరమణ చెశారు. ఆమె ప్రతినెల తన పెన్షన్ కోసం స్వగ్రా స్వగ్రామమైన రామకపల్లి నుండి గోవాకు వెళ్లి పెన్షన్ తీసుకుని వస్తూ ఉండేది. ఈ నెల 20వ తేదీన పెన్షన్ కోసం గోవాకు వెళ్లి తిరిగి వస్తుండగా అదృశమైంది. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల గాలించారు. ఆమె సోమవారం బళ్లారి సమీపంలో రైలు పట్టాల దగ్గర మృతి చెందిందని రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సుబ్బమ్మ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సుబ్బమ్మ మృతదేహం కోసం వెంటనే బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సుబ్బమ్మతో మరణంతో ఆమె కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు - చిత్తూరు 40వ జాతీయ రహదారి మండల పరిధిలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని పాత రామాపురానికి చెందిన వెన్నుపూస నరేంద్ర, తన కుమారుడు యాస్విక్ ప్రసాద్ ఇద్దరూ ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌లో రాయచోటి నుండి - రామపురానికి బయలుదేరారు. రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపం రాగానే కడప వైపు నుంచి కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయే ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.